# అన్ని గ్రూపులు సమానమే!



ధాగం కృష్ణమూర్తి

**పదో తరగతిలో ఉత్తీర్ణత ప్రతి విద్యార్థి జీవితంలో తొలి విజయం. ఇప్పుడు ఇంటర్‌లో ఏ గ్రూప్ తీసుకోవాలి, ఏ కాలేజీలో చేరాలి అనే విషయాల్లో చాలా జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలి. ఈ దశలో విద్యార్థికి సొంతగా ఆలోచించి నిర్ణయం తీసుకునే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. కాబట్టి తల్లిదండ్రులు, శ్రేయోభిలాషుల సలహాలు తీసుకోవడం మంచిది.**

ఎలాంటి తికమకలు లేకుండా, ఒత్తిళ్లకు గురి కాకుండా విద్యార్థులు తీసుకునే నిర్ణయం పైనే వారి భవిష్యత్తు ఏ రంగంలో ఉంటుందనేది ఆధారపడి ఉంటుంది. కళాశాలలు ఇచ్చే ప్రకటనలు, పంచే కరపత్రాలు, ఇంటికి వచ్చి పిల్లలను తమ కళాశాలల్లో చేర్పించమని బతిమాలి, విసిగించి వేధించేవారి సలహాలపై నిర్ణయం తీసుకోవడంలో విద్యార్థి ఇబ్బందిపడుతున్నాడు. తల్లిదండ్రులు కూడా మరింత గందరగోళానికి గురవుతున్నారు. ఇప్పటి వరకు అన్ని సబ్జెక్టులను చదివిన విద్యార్థులు ఇక నుంచి కొన్నింటిని చదవాల్సినవసరం ఉండదు. అభిరుచిని బట్టి గ్రూప్‌ను ఎంపిక చేసుకునే అవకాశాన్ని కల్పించేది ఈ దశే! కానీ మానసిక పరిణతి ఉండని విద్యార్థి కేవలం వ్యక్తిగత ఆలోచనలు, విశ్లేషణల ఆధారంగా, విద్యాసంస్థల ప్రతినిధుల ఒత్తిడితో తోచిన నిర్ణయం తీసుకుంటే భవిష్యత్తులో అది ప్రమాదకరమయ్యే అవకాశం ఉంది.

## నిర్ణయం ఎలా?

ఇంటర్‌స్థాయిలో తీసుకునే నిర్ణయం ఆలోచించి తీసుకోవాలి. విద్యార్థుల వ్యక్తిగత ఇష్టానిష్టాలతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో నిర్ణయం తీసుకోవడం మంచిది. ఒకవేళ వాళ్ల చెప్పిన మార్గం విద్యార్థులు అనుకున్న దానికి భిన్నంగా ఉంటే చర్చించి ఒక అభిప్రాయానికి రావాలి. అదేవిధంగా తల్లిదండ్రులు కూడా తమ అభిరుచులను పిల్లలపై రుద్దకుండా వారి ఆసక్తిని గమనించి, మంచిచెడులను తెలియజెప్పి ప్రోత్సహించాలి. తీసుకునే గ్రూప్ ఏదైనా విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకి బాటలు వేసేదిగా ఉండాలి. 'తల్లిదండ్రుల గొడవేంటిరా బాబో!' అని పిల్లలు, 'మేము చెప్పిన గ్రూప్ ఎందుకు తీసుకోరో చూస్తాం' అని తల్లిదండ్రులు కూడా పంతానికి పోవడం సమంజసం కాదు. ఆ గ్రూప్‌లో చేరడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి ప్రయోజనాలుంటాయో వివరించి, నిర్ణయాన్ని పిల్లలకు వదిలేయడం మంచిది.

## రెండు ముఖ్యమైన దారులు

పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ప్రధానంగా రెండు దారులుంటాయి. ఒకటి పాలిటెక్నిక్, రెండు ఇంటర్మీడియట్.

పై చదువులకు పరిస్థితులు అంతగా అనుకూలించకపోయినా, ఆసక్తి లేకపోయినా, తొందరగా ఉద్యోగంలో చేరే అవసరం ఉన్నా, విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సులు ఎంచుకోవడం మంచిది. లేకపోతే ఇంటర్ స్థాయిలో వృత్తి విద్యా కోర్సులను కూడా ఎంపిక చేసుకోవచ్చు.

చదువులను కొనసాగించాలనుకునేవారు, చదువంటే బాగా ఆసక్తి ఉన్నవారు, ఇతర (మానసిక, ఆర్థిక, కుటుంబ) పరిస్థితులు అనుకూలించే విద్యార్థులు తాము చేయగలిగే శ్రమను, ఉపాధి అవకాశాలను, దృష్టిలో ఉంచుకొని అభిరుచికి అనుగుణమైన గ్రూప్‌ను ఎంపిక చేసుకోవాలి. ఒక గ్రూప్ మంచిది, ఇంకో గ్రూప్‌కి తక్కువ ప్రాధాన్యం అనే భావన తప్పు. గ్రూప్‌ల్లో దేని ప్రత్యేకత దానిదే. ప్రతిభ ఉన్న విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న ఏ గ్రూప్‌తోనైనా అత్యంత ఉన్నత స్థానాలకు ఎదగగలుగుతారు. అలాంటి ఉదాహరణలు కళ్లముందే ఎన్నో కనిపిస్తుంటాయి. ఎటొచ్చి అంకితభావం, చదువుపై శ్రద్ధ, పరిశ్రమ, సాధించాలన్న తపన ఉండాలి.

## గ్రూప్‌లు

ఇంటర్మీడియట్ బోర్డు రకరకాల కాంబినేషన్లలో 85 గ్రూప్‌లు ఆఫర్ చేస్తున్నప్పటికీ అయిదు మాత్రమే ప్రధానంగా ప్రాచుర్యంలో ఉన్నాయి. అవి:

- ★ ఎంపీసీ (మాథ్స్ గ్రూపు)
- ★ బైపీసీ (బయాలజీ గ్రూపు)
- ★ సీఈసీ (కామర్స్ గ్రూపు)
- ★ ఎంఈసీ (మాథ్స్-కామర్స్ గ్రూపు)
- ★ హెచ్ఈసీ (ఆర్ట్స్ గ్రూపు)

**మ్యాథ్స్ గ్రూపు:** ఇంజినీరింగ్ కోర్సులపై ఆసక్తి ఉన్న విద్యార్థులు మ్యాథ్స్ గ్రూప్‌ను ఎంపిక చేసుకోవచ్చు. సాధారణంగా ఎక్కువ శాతం విద్యార్థులు దీన్నే ఎంచుకుంటారు. ఈ గ్రూప్‌తో ఇంటర్ చదివే విద్యార్థులకు భవిష్యత్తులో ఇంజినీరింగ్ కాకుండా ఇతరత్రా ఎన్నో అవకాశాలుంటాయి. ఎందుకంటే గణితం ప్రతిచోట అవసరమవుతుంది. గణితంతో పాటు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు కూడా ఈ గ్రూప్‌లో ఉంటాయి.

**బయాలజీ గ్రూపు:** డాక్టరు, వైద్య సంబంధ ఇతర విభాగాలకు చెందిన కోర్సులు చదవాలనుకునే వారికి ఈ గ్రూప్ మంచి ఎంపిక. ఈ గ్రూప్‌పై విద్యార్థినులు ఎక్కువ ఆసక్తి ప్రదర్శిస్తుంటారు. సాధారణంగా వైద్యుల కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలు, ఎక్కువ శ్రమ పడి ఓపికతో చదివే విద్యార్థులు, ఉద్యోగ విషయంలో తొందరలేని వారు, డాక్టర్ వృత్తిలో చేరాలని కృత నిశ్చయంతో ఉన్న విద్యార్థులు ఈ గ్రూప్‌లో చేరతారు. చక్కగా బొమ్మలు వేయడం కూడా ఈ గ్రూప్ వారికి అవసరం. మెడిసిన్‌లో అవకాశం లభించకపోయినా భవిష్యత్తులో, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మసీ, జెనిటిక్ రంగాల్లో అవకాశాలు ఉంటాయి. కెమిస్ట్రీని సబ్జెక్టుగా ఎన్నుకొని సైంటిస్టులు కావచ్చు. బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఈ గ్రూప్‌లో ఉండే సబ్జెక్టులు.

**కామర్స్ గ్రూపు:** వ్యాపారాలు, గణాంకాలకు సంబంధించిన రంగాల్లో స్థిరపడాలంటే సి.ఇ.సి. గ్రూపు ఎంచుకోవచ్చు. బ్యాంకింగ్, పారిశ్రామిక రంగాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి. చార్టర్డ్ అకౌంటెంట్లుగా, కంపెనీ సెక్రటరీలుగా, ఆర్థికపరమైన లావాదేవీలను నిర్వహించే అవకాశం వీరికి ఉంటుంది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ పరిశ్రమల్లో కూడా కామర్స్ విద్యార్థులకు ఎన్నో అవకాశాలు వస్తున్నాయి.

**మ్యాథ్స్-కామర్స్ గ్రూపు:** రెండు రకాల గణనలను ఒక చోటికి చేర్చిన గ్రూపు ఎంఇసి. లెక్కలు, కామర్స్ సబ్జెక్టుల పట్ల ఆసక్తి ఉన్నవారు, సివిక్స్ వద్దనుకునేవారు ఈ గ్రూప్‌లోకి ప్రవేశించవచ్చు. ఈ మధ్యకాలంలో ఎక్కువమంది విద్యార్థులు ఈ గ్రూపు వైపు ఆకర్షితులవుతున్నారు. ముఖ్యంగా చార్టర్డ్ అకౌంటెంట్లు కావాలనుకునేవారు ఈ గ్రూపును ఎంపిక చేసుకుంటారు. వీరికి ఎకనామిక్స్ సబ్జెక్టు కూడా ఉంటుంది.

**ఆర్ట్స్ గ్రూపు:** చదువుపై ఎక్కువ ఆసక్తిలేని విద్యార్థులు, ఏదో ఒక డిగ్రీ సంపాదించాలనుకున్నవారు ఈ గ్రూపులో చేరతారని చాలా మంది అనుకుంటారు. కానీ ఆ మాట ఎంత మాత్రం నిజం కాదు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లునిర్వహించే వివిధ పరీక్షలు రాయాలనుకునేవారు ఎంతోమంది ఈ గ్రూపును ఎంచుకుంటారు. ఈ గ్రూప్‌నకు ఈ మధ్యకాలంలో కొంత ఆదరణ తగ్గిందనే చెప్పాలి. ఈ అయిదు గ్రూప్‌లే కాకుండా కొన్ని కళాశాలల్లో వేర్వేరు వృత్తి విద్యాకోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ఏ గ్రూపు ఎంచుకున్నా అందులో బాగా చదివి ఉన్నత స్థానానికి వెళ్లే ప్రయత్నం చేయాలి. ఆ గ్రూపుతో చదివి వివిధ రంగాల్లో రాణిస్తున్న విశిష్ట వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలి.

## ఒకేషనల్ కోర్సులు

స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోడానికి, కోర్సుకాగానే ఉద్యోగాన్ని పొందడానికి వీలయ్యే 28 రకాల ఒకేషనల్ కోర్సులను కూడా ఇంటర్మీడియట్ బోర్డు ఆఫర్ చేస్తోంది. మొత్తం ఆరు విభాగాల్లో ఈ కోర్సులు ఉన్నాయి. వాటిలో ఆఫీస్ అసిస్టెంట్‌షిప్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, మెడికల్ లాబ్ టెక్నీషియన్ వంటి కోర్సులకు మంచి ఆదరణ ఉంది.